
సాక్షి ఒడిశా

బుధవారం । 28 । ఫిబ్రవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.2,17,051
బంగారం	25 గ్రాముల 580 మిల్లీ గ్రాములు
వెండి	12 గ్రాముల 800 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



రారండోయ్ వేడుక చూద్దాం..!

రాయగడ జిల్లా కేంద్రానికి సుమారు 13 కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి అమలాభట్ట గ్రామానికి సమీపంలో నిర్మించిన శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. - 8లో



అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

అందరి సహకారంతోనే ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర మంత్రి జగన్నాథ సరక అన్నారు. - 8లో

సందడే.. సందడి



మహోత్సవాలకు హాజరైన రమేష్ చంద్రచావ్ పట్నాయక్‌ను సత్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు



యువతీ, యువకుల అధునిక నృత్యాలు



ఆకట్టుకుంటున్న భరత లీల నాటకం



యువకుల బాడీ బిల్డింగ్ పోటీలు

స్థానిక కళ్లికోట్ యూనివర్సిటీ క్రీడా మైదానంలో మహానగర్ సాంస్కృతిక పరిషత్ ఆధ్వర్యంలో మహానగర్ మహోత్సవాలు సందడిగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి జరిగిన వివిధ సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. అలాగే బాడీ బిల్డింగ్ పోటీల్లో సత్తాచాటిన యువకులకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు ప్రత్యేకంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా బీజేడీ అధ్యక్షుడు డా.రమేష్ చంద్రచావ్ పట్నాయక్, బీడీఏ మాజీ చైర్మన్ సుభాష్ మహరణలు హాజరయ్యారు. – బరంపురం



సాంస్కృతిక ప్రదర్శనలు తిలకిస్తున్న ప్రజలు

న్యూస్‌రీల్

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

బరంపురం: గంజాం జిల్లా దిగపండి రాజపూర్ రహదారిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. దిగపండి పోలీసుస్టేషన్ పరిధిలోని లంజ్యా గ్రామం నుంచి ఇటుకల బట్టీలో పనిచేయడానికి కూలీలు ఆటోలో వెళ్తున్నారు. అయితే వీరు ప్రయాణిస్తున్న ఆటోను రాజపూర్ రహదారిలో వెనుక నుంచి ట్రక్కు ఢీకొనడంతో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఒడ్రాఫ్ బృందం సాయం క్షతగాత్రులను చికిత్స కోసం దిగపండి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దిగపండి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'లక్ష్మీ నారాయణ్‌కు టిక్కెట్టు కేటాయించాలి'



సమావేశంలో పాల్గొన్న గిరిజనులు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా జోడాంబ్ పంచాయతీ పరిధి చిత్రకొండ నియోజకవర్గానికి చెందిన లక్ష్మీ నారాయణ్ ముదిలికి వచ్చే ఎన్నికల్లో బీజేడీ తరుపున టిక్కెట్టు కేటాయించాలని గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం నవీన్ పట్నాయక్‌కు మంగళవారం లేఖ రాశారు. ఈ ప్రాంతం మావోల గుప్పిట్లో ఉన్న సమయంలో 5 సంవత్సరాలు పాటు పోలీసు వృత్తిలో ఉండి మావోలను తరిమికొట్టి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారని పేర్కొన్నారు. ఆయన ఎమ్మెల్యేగా వస్తే మరికొంత అభివృద్ధి జరుగుతుందన్నారు. అనంతరం లేఖను జిల్లా యంత్రాగానికి అందజేశారు.

జైలులో ప్రేమ పెళ్లి



జైలు, న్యాయ శాఖ అధికారుల సమక్షంలో పెళ్లి తంతు



పెళ్లి దండలు మార్చుకుంటున్న ప్రేమజంట

భువనేశ్వర్: పెళ్లిళ్లు స్వర్గంలో జరుగుతాయన్నది నిజమే కానీ, ఇది మాత్రం జైలులో భిన్నంగా జరిగిన పెళ్లి. ప్రియురాలి వర్గాల నేరారోపణతో జైలు పాలైన ప్రేమికుడితో చట్టపరమైన లాంఛనాలతో పెళ్లి జరిగింది. జైలు అధికారుల అనుమతి మేరకు వీరి వివాహం సనాతన ధర్మం, ఆచారాల ప్రకారం వేడుకగా జరిపించారు. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక ఝురపడా ప్రత్యేక జైలు సోమవారం పెళ్లి కళతో కళకళలాడింది. ఈ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ ప్రేమించిన అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. వధూవరుల కుటుంబాల మధ్య కొన్ని మనస్పర్థల కారణంగా అమ్మాయి తరపువారు ఇదివరకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే కాలానుక్రమంగా వివాదాలతో సతమతమైన వీరి ప్రేమ కథకు సంతోషకరమైన మలుపు దక్కింది. ఇరువురి కుటుంబాలు తమ మనసు మార్చుకుని సమస్యకు పరిష్కారం చూపించారు. ప్రేమికులకు పెళ్లి జరిపించేందుకు హృదయపూర్వకంగా ముందుకొచ్చారు. దీంతో యువతి తన ప్రియుడితో వివాహం కోసం ఖుర్దా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీని సంప్రదించింది. ఈ క్రమంలో జైలులో శిక్ష అనుభవిస్తున్న యువకుడు ప్రియురాలితో పెళ్లి కోసం జైలు అధికారుల ఆధ్వర్యంలో ఖుర్దా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీని అభ్యర్థించాడు. వీరి అభ్యర్థనపై జైలు, న్యాయ శాఖ అధికార వర్గాలు సానుకూలంగా స్పందించాయి. పెళ్లి తంతుని మరింత ప్రోత్సహించి ముందుకు నడిపించారు. చట్టపరమైన నిబంధనల మేరకు వీరి వివాహాన్ని అత్యంత ఆనందోత్సాహాలతో జరిపించారు.

'ఎన్నికలకు సైనికుల్లా సిద్ధమవ్వాలి'



మాట్లాడుతున్న రబి నారాయణ నందో

జయపురం: రానున్న సార్వత్రిక ఎన్నికలకు కార్యకర్తలంతా సైనికుల్లా సిద్ధమవ్వాలని బీజేడీ మాజీ మంత్రి రబినారాయణ నందో అన్నారు. జయపురం సమితి ధన్‌పూర్ గ్రామ పంచాయతీలో బీజేడీ కార్యకర్తలతో సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరినవారికి కండువాలు వేసి ఆహ్వానించారు. ఎన్నికల్లో పార్టీ విజయానికి సమష్టిగా పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. సమితి బీజేడీ అధ్యక్షుడు గణేష్ ప్రసాద్ పాడీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా బీజేడీ మహిళా నాయకురాలు డా.ఇందిరా నందో, జిల్లా సాధారణ కార్యదర్శి శివ పట్నాయక్, సీనియర్ న్యాయవాది విష్ణు ప్రసాద్ పాత్రో, జిల్లా పరిషత్ సభ్యులు తొపితి పట్నాయక్, బబుల పాత్రో, ధనపూర్ పంచాయతీ బీజేడీ పర్యవేక్షకులు సంజీవ్, మహిళా బీజేడీ కో-ఆర్డినేటర్ అమాత కోచిమ్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరినవారికి కండువాలు వేస్తున్న ఇందిర నందో

రోడ్డు వేయకుంటే ఎన్నికలు బహిష్కరిస్తాం

పర్లాకిమిడి: జిల్లాలోని ఆర్.ఉదయగిరి బ్లాక్ అనఘా పంచాయతీలోని మూడు గ్రామాలు తుబురిసింగి, బలిగుమ్మా, బెన్నుసాహికి రోడ్డు మంజూరు చేయాలని కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్‌కు ఆయా గ్రామస్తులు మంగళవారం విన్నవించారు. ఎంపీ చంద్రశేఖర సాహు, మోహనా ఎమ్మెల్యే దాశరథి గొమాంగోకు ఎన్ని వినతులు అందజేసినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మార్చి నెలలోగా అధికారులు మూడు గ్రామాల్లో పర్యటించి రోడ్డు మంజూరుకు తగు చర్యలు తీసుకోకపోతే వచ్చే ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు.



వినతిపత్రాలతో మూడు గ్రామాల ప్రజలు

రాష్ట్రంలో మరోసారి బీజేడీ ప్రభుత్వం



సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు

- బీజేడీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు నెక్కంటి

రాయగడ: రాష్ట్రంలో మరోసారి బీజేడీ ప్రభుత్వం వస్తుందని ఆ పార్టీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు అన్నారు. సదరు సమితి కుంభికోటలో కార్యకర్తలతో మహా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం నవీన్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని తెలియజేశారు. ప్రజలతో మమేకమై పనిచేస్తున్న పార్టీ మరోసారి విజయం సాధించేందుకు కార్యకర్తలు నిర్విరామంగా పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో సుస్థిర పాలన అందించే శక్తి కేవలం బీజేడీకి మాత్రమే ఉందన్నారు. ప్రతి ఒక్కరి మనసులో సీఎం చెరగని ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. ఈసారి రాయగడ శాసనసభ స్థానాన్ని బీజేడీ కైవసం చేసుకునేలా అంతా పనిచేయాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో పార్టీలో విభేదాల కారణంగా ఈ స్థానాన్ని పోగొట్టుకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన తప్పులు పునరావృతం అవ్వకుండా కార్యకర్తలంతా సమష్టిగా పనిచేస్తే రాయగడ స్థానాన్ని బీజేడీ కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. అధిష్ఠానం ఎవరికి టిక్కెట్టు కేటాయించినా అందరూ విజయానికి కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియజేయాలన్నారు. అంతకుముందు కుంభికోట మెయిన్ రోడ్డు నుంచి నెక్కంటికి కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ మంత్రి లాల్ బిహారి హిమిరిక, జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు గంగాధర్ పువ్వల, రుషి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



నెక్కంటిని సత్కరిస్తున్న కార్యకర్తలు

ఒకే కాన్పులో ముగ్గురు బిడ్డలు





జన్మించిన ముగ్గురు శిశువులు, (ఇన్‌సెట్లో) తల్లి పూలమతి

జయపురం: బొరిగుమ్మ కమ్యూనిటీ ఆస్పత్రిలో సోమవారం ఒక గర్భిణీ ఒకే కాన్పులో ముగ్గురు బిడ్డలకు జన్మనిచ్చింది. వారిలో ఇద్దరు మగ శిశువులు కాగా ఒక ఆడబిడ్డ ఉంది. బొరిగుమ్మ సమితి హరదొలి గ్రామ పంచాయతీ దాబుగుడ గ్రామానికి చెందిన చైతన్య భార్య పూలమతి సొంతకి పురిటి నొప్పులు రావడంతో బొరిగుమ్మ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆమె ముగ్గురు శిశువులకు జన్మనిచ్చింది. ముగ్గురు బిడ్డల బరువు వరుసగా 1 కేజీ 450 గ్రాములు, 1 కేజీ 350 గ్రాములు, 1 కేజీ 380 గ్రాములు ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. తల్లి, శిశువులను మెరుగైన వైద్యం కోసం జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. శిశువులు అందరూ ఆరోగ్యంగానే ఉన్నట్లు డాక్టర్లు తెలియజేశారు.

ఒకేరోజు మూడు దొంగతనాలు



పట్టణ పోలీసుస్టేషన్ వద్ద బీజేపీ శ్రేణులు

- పోలీసుస్టేషన్ ముట్టడి

జయపురం: పట్టణంలో రోజురోజుకూ దొంగతనాలు పెరుగుతుండడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం వరుసగా మూడు చోట్ల చైన్ స్నాచింగ్‌లు జరగడంతో పట్టణంలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు పట్టణ పోలీసుస్టేషన్‌ను ముట్టడించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ శాశ్వత సభ్యుడు గౌతమ సామంతరాయ్, పట్టణ బీజేపీ అధ్యక్షుడు రాధేశ్యామ్ పారిడ నేతృత్వంలో అనేకమంది కార్యకర్తలు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. పోలీసు అధికారి రమణీ రంజన్ దొళాయ్‌ను కలిసి వెంటనే దుండగులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఉదయం 10.45 గంటల సమయంలో లింగరాజ్ నగర్‌లోని బిశ్వంబర మల్లిక్ తన ఇంటి నుంచి పనిపై బయటకు వెళ్లాడు. ఆ సమయంలో అతని భార్య సరస్వతీ మల్లిక్ తమ దుకాణంలో వ్యాపారం చేసింది. అప్పుడు ఇద్దరు యువకులు దుకాణానికి వచ్చి రూ.10ల వస్తువులు కొని రూ.20ల నోటు ఇచ్చారు. దీంతో వారికి రూ.10లు తిరిగి ఇస్తున్న సమయంలో ఆమె మెడలో ఉన్నటువంటి 16 తులాల బంగారు గొలుసును తెంచుకొని పరారయ్యారు. అదేవిధంగా 10 గంటల సమయంలో స్థానిక విక్రమనగర్ కూడలి వద్దనున్న హనుమాన్ మందిరం ప్రాంతంలో నివాసముంటున్న ఎ.సత్యనారాయణ భార్య ఎ.వెంకట మాధవి తన బంధువుల ఇంటికి వెళ్తోంది. ఆ సమయంలో ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న 25 గ్రాముల బంగారు చైన్ దొంగలించి పట్టుకొని వెళ్లిపోయారు. అలాగే ప్రసాదరావుపేల కూడలి వద్ద సోంబారుతోటకు చెందిన మహిళ మెడలో చైన్ కూడా తెంచుకొని తీసుకెళ్లిపోయారు. విషయం తెలిసిన పోలీసు అధికారి రమణీరంజన్ దొళాయ్, ఏఎస్ఐ సిద్ధార్థ బెహర, ఏఎస్ఐ విష్ణు మడకామిలు ఆయా ప్రాంతాలకు వెళ్లి దర్యాప్తు ప్రారంభించారు. ఆయా ప్రాంతాల్లోని సీసీ కెమేరాల ఆధారంగా దర్యాప్తు జరుపుతున్నారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభం

జయపురం: పట్టణంలోని పూల్‌బెడ ప్రాంతంలో నిర్మించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను సీఎం నవీన్ పట్నాయక్ వర్చువల్ విధానంలో మంగళవారం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో కొరాపుట్ క్రికెట్ అకాడమి, అథ్లెటిక్ అసోసియేషన్ కొరాపుట్, ఒడిశా క్రికెట్ అసోసియేషన్లు సంయుక్తంగా స్థానిక విక్రమ్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అనేక మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జయపురం సబ్ డివిజన్ అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి రబి నాయిక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి రబినారాయణ నందో మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి సీఎం నవీన్ పట్నాయక్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలియజేశారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్‌తో అవిభక్త కొరాపుట్ జిల్లాలో క్రీడాకారులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. సుమారు రూ.47 కోట్లతో కాంప్లెక్స్ నిర్మించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో భువనేశ్వర్ తర్వాత ఇక్కడ రెండో జిమ్నాస్టిక్ ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేశారన్నారు. అలాగే కాంప్లెక్స్‌లో బాస్కెట్ బాల్ కోర్టు, రెండు టెన్నిస్, ఒక ఫుట్‌బాల్ మైదానాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో రన్నింగ్‌లో సత్తా చాటేందుకు సింథటిక్ ట్రాక్, హైజంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో మొదలగు ఆటలకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఈ క్రీడా కాంప్లెక్స్‌లో జర్మన్ వైజ్ఞానిక పద్ధతిలో స్విమ్మింగ్ పూల్ నిర్మించారు. 36 లక్షల లీటర్ల సామర్థ్యం గల పూల్‌లో నీటిని శుభ్రపరిచేందుకు రూ.3 కోట్ల వ్యయంతో 3 అత్యాధునిక యంత్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి అనూప్ కుమార్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.



స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న సీఎం నవీన పట్నాయక్



ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు



స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రవేశ మార్గం



సింథటిక్ ట్రాక్



వాటర్ పూల్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎల్ఎన్ పేట: మండలంలోని అలికాం-బత్తిలి రోడ్డుపై శ్యామలాపురం సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. కొత్తూరు వీఆర్ఓగా పనిచేస్తున్న రాము, వీఆర్ఏ అనిల్‌లు పేదల ఇళ్ల స్థల పట్టాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన పత్రాలను తీసుకుని శ్రీకాకుళం నుంచి ద్విచక్ర వాహనంపై కొత్తూరు వస్తున్నారు. శ్యామలాపురం వద్ద వీరి ద్విచక్ర వాహనానికి అడ్డంగా పశువులు రావటంతో ప్రమాదానికి గురయ్యారని స్థానికులు తెలిపారు. పశువులు రోడ్డుకు అడ్డంగా వచ్చిన సమయంలో వీరు ద్విచక్ర వాహనంపై నెమ్మదిగా రావటంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. స్వల్పంగా గాయపడిన వీరిని 108 అంబులెన్స్ ద్వారా చికిత్సకు తరలించినట్లు తెలిపారు.

ఘనంగా పలాసలో గావు సంబరం



ఆకట్టుకున్న తప్పెటగుళ్లు ప్రదర్శన

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 24వవార్డు పురుషోత్తపురం గ్రామంలో గంగాదేవి గావు సంబరం మంగళవారం ఘనంగా జరిగింది. తప్పెటగుళ్ల కళాకారులు నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. గొల్లచదువు వినేందుకు, తప్పెటగుళ్ల చూసేందుకు పెద్ద ఎత్తున జనం వచ్చారు.

600 లీటర్ల బెల్లపు ఊటలు ధ్వంసం



సారా తయారీకి ఉపయోగించే సామగ్రితో సెబ్ ఎస్ఐ శ్రావణి, సిబ్బంది

కొత్తూరు: కొత్తూరు మండలంలోని చింతమానుగూడ గిరిజన పరిసర ప్రాంతాల్లో స్థానిక సెబ్ ఎస్ఐ శ్రావణి తన సిబ్బందితో మంగళవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో 600 లీటర్లు బెల్లపు ఊటలు ధ్వంసం చేసినట్లు ఎస్ఐ చెప్పారు. 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సారా తయారు చేస్తున్న వారు పరారయ్యారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి పట్టివేత



స్టేషన్ రోడ్డులో 15 కేజీల గంజాయితో దొరికిపోయిన ఒడిశా వాసులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం ఉదయం గంజాయి తరలిస్తున్న ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులను కాశీబుగ్గ పోలీసులు పట్టుకున్నారు. కాశీబుగ్గ పాత జాతీయ రహదారి నుంచి పలాస రైల్వేస్టేషన్‌కు తరలిస్తున్న సమయంలో ముగ్గురు యువకులను పోలీసులు నిలుపుదల చేయగా పారిపోవడానికి ప్రయత్నించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరు రాయగడ నుంచి 15 కిలోల గంజాయిని తీసుకువస్తున్నారు. దాడిలో హెడ్ కానిస్టేబుల్ అటల శ్రీనివాసరావు, ట్రాఫిక్ పీసీ గోన కోదండరావు, సీపీ నీలకంఠం పాల్గొన్నారు. వాటిని డీటీ రవికుమార్ సమక్షంలో విలేకరుల ముందుంచారు. కాశీబుగ్గ ఎస్ఐ పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సమూన్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ రక్షిత నీటి పథకం నిర్వహణ, జలజీవన్ మిషన్‌లపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్ఈ, ఈఈలు, డీఈ, ఏఈలతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. సంతబొమ్మాళి మండలంలోని సముద్ర తీర ప్రాంతాల్లో ఎద్దడి ఉంటుందని చెప్పగా జలజీవన్ మిషన్ పనులు ఎంత వరకు వచ్చిందీ అడిగి తెలుసుకుని త్వరితగతిన పనులు చేపట్టాలన్నారు. కొండ ప్రాంతాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండలాల వారీగా సమీక్షించి మండలాల్లో ఎంపీడీఓలతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. ల్యాబ్‌లో ఏయే పరీక్షలు చేస్తారని కలెక్టర్ డీఈని అడుగగా, నైట్రేట్, ఫ్లోరైడ్, తదితరమైనవి పరీక్షిస్తామని డీఈ చెప్పారు. తాగునీటిలో కాలుష్యం లేకుండా చూడాలని, మందసలో ఫ్లోరైడ్ వచ్చిందని, వెంటనే ఆ బోర్‌ని కండెం చేశామని సంబంధిత ఏఈ వివరించారు. ఆర్‌ఓ ప్లాంట్స్ ఎన్ని ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. కాలుష్యం ఉన్న ప్రాంతాలకు పైపులైన్ల ద్వారా తాగు నీరు అందించేందుకు పది రోజుల్లో గుర్తించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

రారండోయ్ వేడుక చూద్దాం..!



నిర్మితమైన లక్ష్మీనరసింహ స్వామి ఆలయం

- వైభవంగా నరసింహ స్వామి ఆలయ నిర్మాణం
- భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠోత్సవాలు
- రేపు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం



విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



విగ్రహాలకు క్షీరాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లా కేంద్రానికి సుమారు 13 కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి అమలాభట్ట గ్రామానికి సమీపంలోని శ్రీక్షేత్ర టౌన్ షిప్‌లో అత్యంత వైభవంగా శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయం అత్యంత వైభవంగా నిర్మించారు. దీంతో ఈనెల 24వ తేదీ నుంచి భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రతిష్ఠోత్సవాలు నిర్వహిస్తున్నారు. సుమారు 34 మంది వేద పండితులతో పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ మందిరాన్ని ఆదర్శ రైతు, వ్యాపారవేత్త అయినటువంటి దూడల శ్రీనివాస్ సొంత ఖర్చుతో నిర్మించారు. రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించి ప్రస్తుతం పూర్తి చేశారు. పెంట గ్రామానికి చెందిన శ్రీనివాస్ వ్యవసాయ, వ్యాపార రంగాల్లో ముందుకెళ్తూ ఎంతోమందికి ఉపాధి బాటను చూపిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన శ్రీనివాస్ 20 ఏళ్ల క్రితం రాయగడ వచ్చి స్థిరపడ్డారు.

ఏకశిల ధ్వజస్తంభం

ఆలయ ప్రతిష్ఠోత్సవాల్లో ప్రధానమైన ధ్వజస్తంభాన్ని ప్రత్యేకంగా రూపొందించారు. సుమారు 45 అడుగుల ఎత్తైన ఏకశిలతో సుమారు రూ.10 లక్షలతో కృష్ణ జిల్లాలో ప్రత్యేక నగిశీలను చెక్కించారు. అక్కడ నుంచి స్థంభాన్ని తీసుకువస్తుండగా మార్గమధ్యలో స్తంభానికి బీటలు వచ్చాయి. దీంతో తిరిగి మరో నెల రోజుల్లోనే మరో ధ్వజస్తంభాన్ని తయారు చేయించి ప్రత్యేక వాహనం ద్వారా ఇక్కడికి తీసుకొచ్చారు. ఇదిలాఉండగా 20 అడుగుల ఎత్తైన గుమ్మాలు, తలుపులు ఆలయానికి తయారు చేయించారు. ఈ తలుపులు సులువుగా తెరుచుకునే వీలుగా సాంకేతిక పరిజ్ఞానంతో అనపర్తిలోని రాధా ఇంజినీరింగ్ వర్క్స్‌లో బేరింగ్‌లతో కూడిన మెటల్ ఫ్రేములు తయారు చేయించారు. ఇలా ప్రతీ పనిలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ప్రముఖ వైష్ణవ పండితులు ఫణిహారం వెంకట భాస్కరాచార్యులు స్వీయ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా రాజాం పనసవలసకు చెందిన ప్రముఖ శ్రీవైష్ణవ పీఠాధిపతులు తిరుమల రంగనాథ లయ్యావార్ల గురువు ప్రతిష్ఠా ఉత్సవాలకు విచ్చేశారు.

విగ్రహ ప్రతిష్ట రేపు

ఆలయ ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా ఈనెల 29వ తేదీన శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆరోజు ఉదయం చతుస్థానార్చన, నిత్యవిశేష వైష్ణవ శుద్ధి, ప్రాయశ్చిత్త హోమములు, మహాపూర్ణహుతి, గర్త, రత్న, లోహాది న్యాశములు, దేవతామూర్తుల, పూర్ణ కుంభ చక్రాది ప్రతిష్ఠా మహోత్సవాలు జరుగుతాయని ప్రముఖ వేదపండితుడు భాస్కరాచార్యులు తెలియజేశారు.

కల నిజమైంది: దూడల శ్రీనివాస్

నేను స్థాపించిన శ్రీక్షేత్ర టౌన్ షిప్‌లో లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయాన్ని నిర్మించాలని సంకల్పించాను. దాతల కోసం ఆలోచించకుండా ఒక మంచి పని చేసేందుకు ముందుకు వెళ్లాను. అందుకు నా సతీమణి సాయి లక్ష్మీ ఎంతో ప్రోత్సహించింది. ఆలయ ట్రస్టుగా 2020లో రిజిస్ట్రేషన్ చేయించాం. ట్రస్టు అధ్యక్షుడిగా నేను వ్యవహరిస్తుండగా, కోశాధికారిగా నా భార్య లక్ష్మీ అన్ని లావాదేవీలు చూసుకుంటున్నారు. మరి కొంతమంది ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయ సహకారాలు అందించారు. వారి ప్రోత్సాహంతో నేడు స్వామివారి దర్శన భాగ్యం అందరికీ కలుగుతోంది.



తరలిస్తున్న ఏకశిల ధ్వజస్తంభం



యాగం నిర్వహిస్తున్న వేదపండితులు



పూజాదుల్లో పాల్గొన్న శ్రీనివాస్ దంపతులు

అమో ఆస్పత్రి ప్రారంభం



ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రఘునాథ్ పడాల్ తదితరులు

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడలో అమో ఒడిశాను సీఎం నవీన్ పట్నాయక్ వర్చువల్‌గా సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, కొరాపుట్ జిల్లా ప్రణాళిక బోర్డు చైర్మన్ రఘునాథ్ పడాల్, బొయిపరిగుడ సమితి చైర్మన్ ప్రశాంత కుమార్ గుప్త, బీడీవో భాస్కరచంద్ర సాహు, తహసీల్దార్ స్నిగ్ధ రాణి చౌదరి, సమితి ఉపాధ్యక్షుడు పూర్ణిమ బారిక్, జిల్లా బిజూ యువ జనతాదళ్ అధ్యక్షుడు, కొరాపుట్ మున్సిపల్ చైర్మన్ లలాట రంజన్ శెట్టి, కొరాపుట్ మహిళా బీజేడీ పర్యవేక్షకురాలు మీరా పారిడ, జిల్లా మహిళా మోర్చ అధ్యక్షుడు పార్వతీ మిస్త్రి, జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు తులసీ కిరసాని, ఎస్డీసీ సభ్యులు హేమంత మహాపాత్రో, జిల్లా పరిషత్ సభ్యులు రాజేష్ మహరియ, అదనపు బీడీవో నివేదిత దండసేన, కొరాపుట్ జిల్లా మెడికల్ ఆఫీసర్ సుకాంతకుమార్ దాస్, బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రి అధికారి డాక్టర్ అధిరాజ్ సాహు తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి'



కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న పుష్పాంజలి

పర్లాకిమిడి: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ఈనెల 29న జిల్లావ్యాప్తంగా సమ్మె తలపెడతామని ఒడిశా అంగన్‌వాడీ వర్కర్ల సంఘం కార్యదర్శి పుష్పాంజలి పండా స్పష్టం చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్‌కు వినతిపత్రం మంగళవారం అందజేశారు. విధుల నుంచి తొలగించిన గుసాని సమితి జాజిపూర్ గ్రామ అంగన్‌వాడీ వర్కర్‌ను తిరిగి సర్వీసులోకి తీసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ వర్కర్లకు నెలకు రూ.18 వేల జీతంతో పాటు వయో పరిమితి పెంచాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన నిర్ణయం తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

- మంత్రి జగన్నాథ సరక



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జగన్నాథ సరక

పర్లాకిమిడి: అందరి సహకారంతోనే ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక అన్నారు. స్థానిక గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా కేంద్రం కాన్ఫరెన్స్ హాల్‌లో గజపతి జిల్లా ప్రణాళిక కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు.

సమావేశానికి గౌరవ అతిథులుగా జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు, మోహనా ఎమ్మెల్యే దాశరథి గొమాంగో, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు కుంతలా మల్లిక్ విచ్చేయగా, ప్లానింగ్ కమిటీ చైర్మన్ కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యనిర్వహణ అధికారి గుణనిధి నాయక్ మాట్లాడుతూ.. వార్షిక బడ్జెట్‌లో గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యం, రోడ్లు, రవాణా, తాగునీరు, వ్యవసాయానికి ప్రాధాన్యమివ్వడం జరుగుతుందన్నారు. అయితే సమావేశం ప్రారంభమైన వెంటనే పర్లాకిమిడి, మోహనా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కోడూరు నారాయణరావు, దాశరథి గొమాంగోలు సమావేశాన్ని బహిష్కరించారు. అనంతరం జిల్లా ప్రణాళికా కమిటీ సమావేశాలు అర్ధాంతంగా ముగిశాయి.

స్వాభిమాన్ ఏరియాలో జన సంపర్క్ శిబిరం



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియాలో చిత్రకొండ ఎస్డీపీవో అలెక్స్ కృష్ణప్ప నేతృత్వంలో జన సంపర్క్ శిబిరం మంగళవారం నిర్వహించారు. దీనిలో భాగంగా మహిళలకు చీరలు, నిత్యావసర సరుకులు అందజేశారు. అలాగే వైద్య శిబిరం నిర్వహించి అవసరమైనవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా యువకులకు స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్లు అరెస్టు



అరెస్టైన పేకాటరాయుళ్లు

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి సీక్‌పల్లీ గ్రామంలో సోమవారం రాత్రి పేకాట శిబిరంపై మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్ కీండో తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. వివరాల్లోకి వెళ్తే.. పోలీసులు రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో సీక్‌పల్లి ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు దాడి నిర్వహించి ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో బంగూడ గ్రామానికి చెందిన రామ్ పోడియమి (24), ఎంవీ 51 గ్రామానికి చెందిన సుభల్ సహ (45), జగ మడ్కమి (50), రామ మడీ (58), మయో మడ్కమి (30)లు ఉన్నట్లు వెల్లడించారు. వారి వద్ద నుంచి రూ.9,280 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి మంగళవారం కోర్టుకు తరలించారు.

బరంపురం వరకు విశాఖ-పలాస పాసింజర్



రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్‌తో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ(ఫైల్)

కంచిలి: విశాఖపట్నం నుంచి పలాస వరకు నడుస్తున్న ప్యాసింజర్ రైలు 08531(58531), 08532(58532)లను బరంపురం వరకు పొడిగిస్తున్నట్లు రైల్వే బోర్డు జాయింట్ డైరెక్టర్ వివేక్ కుమార్ సిన్హా ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ మేరకు ఈస్ట్ కోస్ట్ రైల్వే సీపీటీఎం, భువనేశ్వర్‌కు సమాచారం అందినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. ఈ మేరకు సోంపేట స్టేషన్ మేనేజర్ శంకర్ బెహరా మంగళవారం తెలిపారు. ప్రతి రోజు ఈ రైలు ఉదయం 3.50 గంటలకు బరంపురంలో బయలుదేరి, ఇచ్ఛాపురానికి 4.09కు చేరి, అక్కడి నుంచి 4.10 గంటలకు బయల్దేరి సోంపేటకు 4.22కు చేరి, ఇక్కడ 4.23కు బయల్దేరి, మందస రోడ్డుకు 4.33కు చేరి, అక్కడి నుంచి 4.34కు బయలుదేరుతుంది. ఈ రైలు విశాఖపట్నానికి ఎప్పటిలాగే ఉదయం 9.20 గంటలకు చేరుతుంది. తిరిగి విశాఖపట్నం నుంచి సాయంత్రం 5.45 గంటలకు బయల్దేరి, మందసకు రాత్రి 10.15గంటలకు, సోంపేటకు 10.31కు, ఇచ్ఛాపురానికి 10.47కు, బరంపురానికి 11.10 గంటలకు చేరుతుంది.

జెడ్పీ చైర్‌పర్సన్ కృషి మేరకే..

విశాఖ-పలాస పాసింజర్ రైలు సర్వీసు బరంపురం వరకు పొడిగించడంలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ కృషి ఉంది. ఇదివరకే ఆమె రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను ఢిల్లీలో కలిసి ఈ మేరకు విన్నవించిన అంశాన్ని మంగళవారం ఓ ప్రకటనలో గుర్తు చేశారు. రైల్వే ప్రయాణికుల సంఘం తరఫున జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయతోపాటు, జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు కట్టా సూర్యప్రకాశ్ కూడా పలుసార్లు లేఖలు రాయడం, రైల్వే బోర్డు సమావేశాల్లో ఈ విషయమై ప్రస్తావించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.

వివాహిత హత్య

- హతురాలు, నిందితుడు ఇద్దరూ ఒడిశా వాసులే
- సారవకోట మండలం నౌతళ సమీపంలో హత్య





సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ బాలచంద్రా రెడ్డి (ఇన్‌సెట్లో) మృతురాలు ఆరుద్ర (ఫైల్)

సారవకోట,పాతపట్నం: మండలంలోని నౌతళ సమీపంలో శుక్రవారం జరిగిన హత్యోదంతం మంగళవారం వెలుగులోకి వచ్చింది. మృతురాలి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. టెక్కలి మండల రంగాపురం గ్రామానికి చెందిన శాసనాం ఆరుద్ర అనే మహిళకు 19 ఏళ్ల కిందట ఒడిషా రాష్ట్రం రాయఘడ బ్లాక్, పాటికోటకు చెందిన సోమేశ్వరరావుతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈమె భర్త పాటికోటలో కూరగాయల వ్యాపారం చేస్తుంటారు. ఆరుద్రకు ఆ గ్రామానికి సమీపంలో ఉన్న కాంట్రగడ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఊడు పాపారావుతో పరిచయం ఏర్పడింది. ఈ నెల 23న ఆరుద్ర తన కన్నవారి గ్రామమైన రంగాపురానికి వెళ్లారు. అదే రోజు సాయంత్రం ఆమె తిరిగి అత్తవారింటికి బయల్దేరారు. ఆమె సోదరుడు పైల లోకేశ్వరరావు ఆమెను తెంబూరులో బస్సు ఎక్కించారు. అయితే ఆమె పాటికోట చేరలేదు. ఈ విషయం తెలుసుకున్న సోదరుడు అదే రోజు రాత్రి పాతపట్నం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆరుద్ర ఫోన్ కాల్స్ ఆధారంగా కాంట్రగడ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఊడు పాపారావును విచారించారు. విచారణలో విస్తుబోయే వాస్తవాలు తెలిశాయి. ఆరుద్ర తాను చంపేశానని ఆటో డ్రైవర్ చెప్పడంతో పోలీసులు ఆ స్థలాన్ని చూపించాలని సూచించారు. దీంతో అతడు సారవకోట మండలం నౌతళ గ్రామానికి సమీపంలో ఉన్న తోటలోకి తీసుకెళ్లి చూపించగా.. అక్కడ ఆరుద్ర మృతదేహం గుర్తు పట్టలేని స్థితిలో కనిపించింది. తామి ద్దరం ఆటోలో ఇక్కడకు వచ్చామని, తొలుత ఇద్దరం సన్నిహితంగా మెలిగామని, ఆ తర్వా త ఇద్దరి మధ్య గొడవ జరగడంతో హత్య చేశానని అతను ఒప్పుకున్నాడు. చంపేశాక ఆమె మెడలో ఉన్న బంగారాన్ని తీసుకుని వెళ్లినట్లు చెప్పాడు. హత్య జరిగి ఐదు రోజు లు కావడంతో మృతదేహం పాడైపోయింది. సంఘటన స్థలాన్ని టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి, నరసన్నపేట సీఐ ప్రసాదరావు, సా రవకోట, పాతపట్నం సీఐలు జి.అప్పారావు, మహమ్మద్ యాసిన్‌లు పరిశీలించారు.

జాతీయ లోక్ అదాలత్ 16కి వాయిదా

శ్రీకాకుళం పాతబస్టాండ్: మార్చి 9న జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్ మార్చి 16కి వాయిదా వేసినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సన్యాసినాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మార్చి 9న మహాశివరాత్రి ఉండడంతో వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు మాత్రమే కాకుండా మోటార్ బీమా కేసులు బ్యాంకు కేసులు, ప్రీ లిటికేషన్ స్థాయిలో ఉండే కేసులు పరిష్కరిస్తామన్నారు. జిల్లా ప్రధాన కేంద్రంతో పాటు ఆమదాలవలస, కోటబొమ్మాళి, పాలకొండ, పలాస, పాతపట్నం, రాజాం సోంపేట, టెక్కలి, నరసన్నపేట, కొత్తూరు, పొందూరు, ఇచ్ఛాపురం కోర్టుల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలో ప్రజలంతా గమనించాలని కోరారు.

'సాంకేతికతకు పదును పెడదాం'

టెక్కలి: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యతకు సాంకేతికతను జోడించి సరికొత్త ఆలోచనలకు పదును పెట్టాలని ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ సీఈఓ అనిల్ టెంటు సూచించారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జాతీయ స్థాయిలో గోకార్ట్ చాంపియన్ షిప్, యాక్‌తాన్-2024 పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్టార్టప్‌లకు పెద్ద ఎత్తున ప్రాధాన్యత ఇస్తున్నాయని ఆయన గుర్తు చేశారు. ఇలాంటి జాతీయ స్థాయి కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని వారి ప్రతిభను నిరూపించుకోవాలని సీఈఓ కోరారు. రాష్ట్ర ఇన్నోవేషన్ సొసైటీ, 40 యూనివర్సిటీలతో కలిసి ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో విద్యార్థులంతా 5జీ, ఎమర్జింగ్ టెక్నాలజీపై మక్కువ పెంచుకోవాలన్నారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. జాతీయ స్థాయి గోకార్ట్ పోటీల్లో ఏపీ, తెలంగాణ, కర్ణాటక నుంచి సుమారు 15 ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. యాక్‌తాన్ పోటీలకు ఏపీ, తెలంగాణా, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళ, ఒడిశా, ఆగ్రా, చండీఘర్, పంజాబ్ రాష్ట్రాల నుంచి 35 బృందాలు పాల్గొన్నాయి. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ వి.సుధాప్రియ, డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, వి.నాగసంకేత్, కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, కోశాధికారి టి.నాగరాజు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, కార్యక్రమం కన్వీనర్లు డి.శ్రీరాములు, డి.ఆజాద్, జి.సతీష్‌కుమార్, డీన్‌లు డి.విష్ణుమూర్తి, డి.విజయ్‌కుమార్, బి.వి.రమణ, ఎం.జయమన్మథరావు, డి.యుగంధర్, బి.రామారావు, యు.డి.ప్రసన్న, వై.రమేష్, పి.దినకర్, కె.కిరణ్‌కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'నైపుణ్యాలకే పెద్దపీట'

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థుల్లో నైపుణ్యాలకు ప్రాధాన్యత ఇస్తామని బీఆర్ఏయూ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజిని అన్నారు. ఉన్నత విద్యా మండలి, సెంటర్ స్కిల్ కౌన్సిల్ వర్చువల్‌గా మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. భవిష్యత్‌లో డిగ్రీ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఏడాది పాటు నిర్వహించనున్న అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రొగ్రాం కోర్సుపై ఉన్నత విద్యా మండలి అధికారులు పలు సూచనలు చేశారు. సెంటర్ ఫర్ రీసెర్చ్ స్కీమ్ ఆఫ్ పాలసీస్ సంస్థ ఈ కార్యక్రమం నిర్వహిస్తుందని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం కనీసం ఐదు కళాశాలల్లో పైలెట్ ప్రాజెక్టుగా ఈ పథకం ప్రారంభమవుతుందని, అందుకు గాను వర్సిటీ పరిధిలోని కళాశాలల జాబితా సిద్ధం చేసి అందజేయాలని సూచించారు. ప్రధానంగా విద్యార్థులకు తాము చదువుతున్న కోర్సుకు సంబంధించి అనుసంధానంగా పరిశ్రమలు, వ్యాపార సముదాయాలు, ఆన్‌లైన్ వ్యాపార సంస్థలు, రవాణా రంగం వంటి వాటిపై అవగాహన కల్పించి నైపుణ్యాలు నే ర్పిస్తామన్నారు. నూతన విద్యా విద్యా విధానం నేపథ్యంలో విద్య బలోపేతం, విద్యార్థుల్లో నైపుణ్యాలు, విద్యార్థులకు ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వీసీ తెలిపారు.

క్లుప్తంగా

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

గుర్ల: మండలంలోని సొలిపిసోమరాజు పేట వద్ద మంగళవారం టాటాఏస్ వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ప్రమదం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గరికివలసకు చెందిన కనిమెరక సన్యాసప్పలనాయుడు (48) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు లాగానే పని ముగించుకుని గరికివలస వెళ్లడానికి సొలిపిసోమరాజు పేట జంక్షన్‌లో వేచి ఉన్నాడు. రోడ్డు పక్కన నిల్చున్న సన్యాసప్పలనాయుడిని చీపురుపల్లి నుంచి వస్తున్న టాటా ఏస్ వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు ఆస్పత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై భాస్కరరావు చెప్పారు.

140 లీటర్ల సారాతో ఐదుగురి అరెస్ట్



పట్టుబడిన సారా క్యాన్లు, నిందితులతో ఎస్‌ఈబీ అధికారులు

పాలకొండ రూరల్: సీతంపేట మండలం నారాయణ గూడ నుంచి బందమాను గూడ మీదుగా పాలకొండ మండలానికి కావిళ్లతో 140 లీటర్ల సారాను తరలిస్తున్న ఐదుగురు నిందితులను ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో ప్రత్యేక విభాగం సీఐ జి.శ్రీనివాస్ అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక ఎస్‌ఈబీ అధికారులతో కలిసి రూట్ వాచ్ నిర్వహిస్తున్న క్రమంలో సీతంపేట మండలానికి చెందిన నిందితులు సారాతో పట్టుబడ్డారు. తొలుత వారిని ఎస్‌ఈబీ కార్యాలయానికి తరలించారు. కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపర్చనున్నట్లు అధికారులు తెలిపారు. రూట్ వాచ్‌లో ఎస్‌ఈబీ ఎస్సైలు బి.చల్లంనాయుడు, బి.చంద్రశేఖర్‌రాజు, సిబ్బంది ఉపేంద్రకుమార్, పఠాన్ ఇమాన్, పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.

చోరీకేసులో నిందితులకు రిమాండ్

విజయనగరం క్రైమ్: ఓఎల్‌ఎక్స్‌లో సెల్‌ఫోన్ కొంటామని చెప్పి, అక్కడికి ఫోన్‌లు పట్టుకు వచ్చిన వారిని చితక్కొట్టి రెండు సెల్ ఫోన్‌లు, రూ.7వేలు నగదు దోచుకున్నట్లు బాధితులు ఈ నెల 15న వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు విసినిగిరి కుమార్ అలియాస్ సూర్య, సోము నవీన్ అనే ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేసి వారి నుంచి రెండు సెల్ ఫోన్‌లు, రూ. 2వేలు నగదు రికవరీ చేశారు. ఈ మేరకు వారిని అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు.

దుకాణాల ఆకస్మిక తనిఖీ



కెల్లలో కేసు నమోదు చేస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారి దామోదర నాయుడు

గుర్ల: మండలంలోని కెల్ల, వల్లాపురం, బెల్లాన పేటలోని వ్యాపార దుకాణాలను లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ఎం. దామోదర నాయుడు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిరాణా, చికెన్, కూరగాయల షాపులు తనిఖీ చేసి సీళ్లు లేని కాటాలను గుర్తించారు. సీళ్లు లేకుండా అమ్మకాలు జరుపుతున్న షాపు యజమానులపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలోని మూడు గ్రామాల్లో ఆరు కేసులు నమోదు చేశామని చెప్పారు. కేసులు నమోదు చేసిన వారిలో టెక్నికల్ ఇన్‌స్పెక్టర్ బి.సత్య నారాయణ ఉన్నారు.

బైక్, ఆటో ఢీకొని ముగ్గురికి గాయాలు



ఘటనాస్థలంలో ప్రమాద దృశ్యం

పాలకొండ రూరల్: పాలకొండ–సీతంపేట ప్రధాన రహదారిలో సిరికొండ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో ముగ్గురు యువకులు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. పాలకొండ మండలం లుంబూరు గ్రామానికి చెందిన బి.ఉపేంద్ర, వి.మోహన్ కుమార్, ఎస్.సాయి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొన్నారు. దీంతో స్థానికులు ప్రమాదాన్ని గమనించి ఉపేంద్రకు తీవ్ర గాయాలు కావడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మిగిలిన ఇద్దరు క్షతగాత్రులను పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఈ ప్రమాదంపై ఎస్సై ఎన్.ప్రశాంత్ కుమార్ కేసు నమోదు చేశారు.

అబ్బురపరిచే ఆవిష్కరణలు

- జేఎన్‌టీయూ జీవీలో ఆకట్టుకున్న ఎక్స్‌పో
- ఆలోచనలను ప్రాజెక్టులుగా తీర్చిద్దిన విద్యార్థులు

విజయనగరం అర్బన్: విద్యార్థులను భావిశాస్త్రవేత్తలుగా, ఇంజినీరింగ్ నిపుణులుగా తీర్చిదిద్దాలన్న ప్రధాన ఉద్దేశంతో జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ కళాశాల ట్రిపుల్‌ఈ విభాగం రెండురోజుల పాటు సైన్స్ ఎక్స్‌పో నిర్వహించింది. విద్యార్థుల ఆలోచనలను ఆవిష్కరణల రూపంలో ప్రదర్శించేందుకు చక్కని వేదిక ఏర్పాటుచేసింది. ఇక్కడ వర్సిటీ పరిధిలోని 10 కళాశాలలకు చెందిన విద్యార్థులు 37 వైజ్ఞానిక ప్రాజెక్టులను ప్రదర్శించారు. కొత్తకొత్త ఆవిష్కరణలతో సందర్శకులను ఆకుట్టుకున్నారు. విద్యార్థుల్లో పరిశోధనాత్మక స్ఫూర్తిని పెంపొందించారు.

సోలార్ పవర్ ఆగ్రోరోవర్



సోలార్ పవర్ ఆగ్రోరోవర్ పనితీరును వివరిస్తున్న రూపకర్తలు

వ్యవసాయ రంగంలో మారుతున్న అవసరాలకు అనుగుణంగా రూపొందించిన సాంకేతిక పరికరం సోలార్ ఆగ్రోరోవర్. ఆనందపురం మండలం సొంత్యాం ఎన్‌ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎ.జ్యోత్స్న, మహమ్మద్ అద్నాన్, సీహెచ్. యశ్వంత్, కె.కృష్ణ దీనిని రూపొందించారు. పొలాన్ని దుక్కిచేయడం, విత్తనాలు జల్లడం, కలుపుమొక్కలు తీయడం, చేనుకోయడం వరకు అన్ని పనుల్లోనూ రైతులకు అనువైన పరికరం ఇది. డ్రైవర్ లేకుండా సెల్ నుంచి రిమోట్ కంట్రోల్‌తో ఆపరేటింగ్ చేయొచ్చు. విద్యుత్‌ను సోలార్ ప్యానల్ ద్వారా తక్కువ వ్యయంతో అందించేలా దీనిని రూపొందించారు.

సోలార్ చార్జింగ్ మూవ్‌బుల్ స్టేషన్ ఫర్ ఎలక్ట్రికల్ వెహికల్స్



సోలార్ చార్జింగ్ మూవ్ బుల్ స్టేషన్ ఫర్ ఎలక్ట్రికల్ వెహికల్స్ పరికరం

జర్నీలో ఎలక్ట్రికల్ చార్జింగ్ అవసరాలను తీర్చే ప్రాజెక్టు 'సోలార్ చార్జింగ్ మూవ్ బుల్ స్టేషన్ ఫర్ ఎలక్ట్రికల్ వెహికల్స్'. మొబైల్స్ నుంచి ఎలక్ట్రికల్ వాహనాల వరకు అవసరమైన ఎలక్ట్రికల్ చార్జింగ్‌ను ఇది ఇస్తుంది. కేవలం రూ.7వేల వ్యయంతోనే ఈ పరికరాన్ని లెండీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎస్.విష్ణువర్ధన్, యు.తేజశ్వని, పి.సాయి కిరణ్, వి.దినేష్‌కుమార్ రూపొందించారు.



ఏఐ యాప్‌లో కేన్సర్ కారకాలను గుర్తిస్తున్న విద్యార్థి

స్కిన్ కేన్సర్ డిటెక్షన్ విత్ వైఓఎల్‌ఓ

మానవ శరీరంలోని కేన్సర్ కారకాలను గుర్తించే నూతన ప్రాజెక్టు ఇది. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) ద్వారా పనిచేసే ఈ పరికరంతో కేన్సర్ కారకాలను సులభంగా తెలిసుకోవచ్చు. స్కిన్ భాగాన్ని ఫొటో తీసి దానిని ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో స్కాన్ చేయాలి. యాప్‌లో ఉన్న దాదాపు 3 వేల రకాల కేన్సర్ వ్యాధుల లక్షణాలతో పోల్చుతుంది. ఈ విధంగా ఖర్చులేకుండా కేన్సర్ వ్యాధి కారకాన్ని తెలుసుకోవచ్చు. దీనిని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు మహతా చోప్రా, ఎల్.ఆర్.వినయ్‌కుమార్, వట్టూరి వైకుంఠవాసు, కె.సింధుజ రూపొందించారు.

ఎలక్ట్రికల్ షాక్ స్టిక్

మహిళల రక్షణకు అవసరమైన ఎలక్ట్రికల్ షాక్ స్టిక్ ఇది. పాకెట్‌లో పెట్టుకొనే సైజ్‌లో ఉంటుంది. ఒంటరి మహిళ ప్రయాణంలో రక్షణగా ఉంటుంది. ఎదుట వ్యక్తికి తెలియకుండా విద్యుత్ షాక్ ఇచ్చేయవచ్చు. ఎదురుదాడిలో ఎక్కువ మంది ఉన్నపుడు స్టిక్‌కి ఉన్న స్విచ్ ఆన్‌చేస్తే స్విచ్‌కి ముందుగా అనుసంధానం చేసిన ఫోన్ నంబర్లకు మెసేజ్ వెళ్తుంది. దీనిని విశాఖపట్నం గాయత్రి విద్యాపరిషత్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు జి.లోకేశ్, పి.మాధవ్‌కృష్ణ, కె.సుజిత్ సూర్య, జావేద్ ఖాన్ రూపొందించారు.



ఎలక్ట్రికల్ షాక్ స్టిక్ వినియోగాన్ని వివరిస్తున్న విద్యార్థులు

పూర్తిస్థాయిలో మందుల సరఫరా

- తీరిన రోగుల ఇబ్బందులు
- ఆస్పత్రులకు బడ్జెట్ భారీగా పెంచిన ప్రభుత్వం
- గతంలో ఏడాదికి రూ.1.72 కోట్ల బడ్జెట్
- ప్రస్తుతం రూ.17.21 కోట్లకు పెంచిన ప్రభుత్వం

విజయనగరం ఫోర్ట్: ప్రజారోగ్యానికి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నాడు-నేడు ద్వారా ఆస్పత్రుల రూపు రేఖలు మార్చేసింది. అంతేకాకుండా అవసరమైన వైద్య పరికరాలు కూడా సమకూర్చింది. దీంతో రోగులకు ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. వ్యాధి నివారణలో మందులు చాలా ప్రధానం. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులు పేద, మధ్యతరగతి వర్గానికి చెందిన వారే. ఈనేపథ్యంలో వారికి అన్ని రకాల మందులు పూర్తి స్థాయిలో అందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల వివరాలు:
ఉమ్మడి విజయనగరం జిల్లాలో 68 పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు)లు, 20 యూపీహెచ్‌సీ(పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు)లు, ప్రాంతీయ ఆస్పత్రులు-3, సామాజిక ఆరోగ్య కేంద్రా (సీహెచ్‌సీ)లు-8, జిల్లా ఆస్పత్రి ఒకటి, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఉన్నాయి. వీటికి ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య మౌలిక సదుపాయల సంస్థ(ఏపీఎంఎస్‌ఐడీసీ) సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి మందులు సరఫరా చేస్తుంది.



సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో నిల్వ ఉన్న మందుల బాక్సులు

భారీగా పెరిగిన బడ్జెట్
ప్రభుత్వ ఆస్పత్రులకు ఇచ్చే మందుల బడ్జెట్‌ను జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం భారీగా పెంచింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రోగులకు అరకొరగా మందులు మాత్రమే అందేవి. కానీ ప్రస్తుతం రోగులకు పూర్తి స్థాయిలో మందులు అందజేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏడాదికి మందుల బడ్జెట్ రూ.1.72 కోట్లు ఉంటే ప్రస్తుత ప్రభుత్వం ఏడాదికి రూ. 17.21 కోట్లు కేటాయిస్తోంది. అదేవిధంగా సర్జికల్ బడ్జెట్ టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.52 లక్షలు ఉంటే ప్రస్తుత ప్రభుత్వం సర్జికల్ బడ్జెట్‌ను రూ.5 కోట్లకు పెంచింది.



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మందుల కోసం క్యూలో ఉన్న రోగులు

> **పూర్తిస్థాయిలో అన్ని రకాల మందులు**
>
> ప్రభుత్వ ఆస్పత్రులకు సరఫరా చేసే మందుల బడ్జెట్‌ను ప్రభుత్వం భారీగా పెంచింది. దీని వల్ల అన్ని రకాల మందులు రోగులకు పూర్తి స్థాయిలో అందించగలుగుతున్నాం. అదేవిధంగా సర్జికల్ మెటీరియల్స్ కూడా పూర్తిస్థాయిలో సరఫరా చేస్తున్నాం.
>
> – బి. సన్యాసినాయుడు సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఇన్‌చార్జ్

రైతన్నకు పెట్టుబడి సాయం

- నేడు వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ నిధులు విడుదల

విజయనగరం ఫోర్ట్/బొబ్బిలి: వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ ఐదో సంవత్సరం మూడో విడత నిధులను ప్రభుత్వం బుధవారం విడుదల చేయనుందని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు తెలిపారు. ప్రభుత్వం ఏటా వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ కింద రూ.13,500 సాయాన్ని మూడు విడతలుగా ప్రభుత్వం అందజేస్తోందన్నారు. మొదటి విడతలో రూ.7,500, రెండో విడతలో రూ.4వేలు, మూడోవిడతగా రూ.2 వేలు చొప్పున అందజేస్తున్నారన్నారు. 2,63,414 మంది రైతులకు రూ.52.73 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేయనున్నట్లు వెల్లడించారు. సాధారణ రైతులు 2,59,519 మందికి రూ.51.90 కోట్లు, అటవీభూమి సాగుదారులు 1110 మందికి 0.222 కోట్లు, భూమి లేని సాగుదారులు 2,785 మందికి 0.61 కోట్లు జమచేస్తారని చెప్పారు. వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు పథకానికి సంబంధించి 17-11-2020 నుంచి 28-02-2024 వరకు 46,460 మంది రైతుల ఖాతాల్లో రూ.8.89 కోట్లు జమచేస్తారన్నారు.

ఖరీఫ్‌లో రూ.6.69 కోట్లు...
జిల్లాలో 2022 సంవత్సరానికి సంబంధించి పంట కాలానికి రైతులు తీసుకున్న రుణాలకు రూ.6,69,82,558ల వడ్డీ సొమ్మును రైతులకు రాయితీగా ప్రభుత్వం అందజేయనుంది. మొత్తం 33,769 మంది రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది.

2021–22లో రబీ కాలానికి రూ.2.19కోట్లు..
రబీ సీజన్ 2021–22 సంవత్సరంలో 12,691 మంది రైతులు వివిధ బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారు. వీరి రుణాలకు అయిన వడ్డీ రూ.2,19,60,248లను ప్రభుత్వం భరిస్తోంది. ఈ మేరకు ఈ నిధులను రైతులు రుణాలు తీసుకున్న బ్యాంకు ఖాతాల్లో జమచేయనుంది.

> **రబీ, ఖరీఫ్ సీజన్‌ల వడ్డీ రాయితీ ఒకేసారి చెల్లింపు..**
>
> జిల్లాలోని రైతులంతా రెండు దఫాలుగా రుణాలు తీసుకుంటారు. ఖరీఫ్‌లో సాగు కోసం ఒక సారి, అనంతరం వచ్చే రబీ పంటకాలానికి మరోసారి పంట రుణాలను వివిధ బ్యాంకుల్లో వారి భూముల విస్తీర్ణం ఆధారంగా తీసుకుంటారు. ప్రతీ రైతు సక్రమంగా రుణాలు చెల్లిస్తారు. అలా సక్రమంగా నిర్ణీత కాలంలో రుణాలు చెల్లించిన వారికి మాత్రమే ఈ వడ్డీ రాయితీ వర్తిస్తుంది.

1200 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం

- మైక్రో ఇరిగేషన్ శాఖ డీడీ లక్ష్మీనారాయణ

రామభద్రపురం/తెర్లాం: ఈ ఏడాది విజయనగరం జిల్లాలో 1200 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం చేపట్టేందుకు రూ.6.80 కోట్లతో రాయితీపై పరికరాలు అందించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని ఏపీఎంఐపీ డీడీ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ మేరకు రామభద్రపురం మండలంలోని రొంపల్లి, ఎస్ సీతారాంపురం, తెర్లాం మండలంలోని అంట్లవార గ్రామంలో ఆయన పర్యటించి రైతులకు బిందు సేద్యానికి రాయితీపై అందించిన పరికరాలను మంగళవారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 500 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం చేపట్టగా ఆయా పరికరాలకు ప్రభుత్వం రూ.3.80 కోట్లు ఇవ్వగా రూ.2.09 కోట్లు రాయితీ ఇచ్చిందన్నారు.అన్ని వర్గాల చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం రాయితీతో పరికరాలను అందిసామని తెలిపారు. వేరుశనగ, నువ్వులు, పప్పుధాన్యాలు, చిరు ధాన్యాలు, ఆకుకూరలు తుంపర్ల సేద్యానికి అనువైన పంటలని చెప్పారు. మామిడి, జీడిమామిడి, కొబ్బరి, ఆయిల్‌పామ్, సపోటా, జామ, చెరుకు, పత్తి,మల్బరి, కూరగాయలు కూడా బిందు సేద్యానికి అనువైన పంటలన్నారు. ఈ పథకాలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు.



రామభద్రపురం: రొంపల్లిలో రైతులు అమర్చిన బిందుసేద్యం పరికరాలను పరిశీలిస్తున్న మైక్రో ఇరిగేషన్ శాఖ డీడీ లక్ష్మీనారాయణ



తెర్లాం: అంట్లవారలో సాగుచేస్తున్న ఆయిల్ పామ్ పాయిల్ తోటను పరిశీలిస్తున్న జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ

వ్యాన్ బోల్తా పడి 25 మందికి..



పీహెచ్‌సీలో క్షతగాత్రులు

మక్కువ: మండలంలోని దబ్బగెడ్డ పంచాయతీ విజయరామపురం గ్రామానికి చెందిన గిరిజనులు మంగళవారం పెళ్లి చూపులకు వెళ్లి వస్తుండగా, వ్యాన్ బోల్తా పడడంతో సుమారు 25 మంది గాయాల పాలయ్యారు. ఈ ప్రమాదంపై గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాలూరు మండలం కొదమ గ్రామంలో పెళ్లి చూపులకు సుమారు 40 మంది గిరిజనులు విజయరామపురం గ్రామం నుంచి వ్యాన్‌లో వెళ్లారు. పెళ్లిచూపులు ముగించుకుని గ్రామానికి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో సాలూరు మండలం మోనంగిగ్రామం వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. వెంటనే గిరిజనులు 108కు సమాచారం అందించారు. 108 వచ్చేలోపు గాయపడిన పలువురిని ఆటోల్లో, ద్విచక్ర వాహనాల్లో శంబర పీహెచ్‌సీకి తరలించారు. మిగిలిన వారిని 108లో ఆస్పత్రికి తరలించారు. సుబ్బారావు, మోహన్, శ్రీదేవి తీవ్రగాయాల పాలవడంతో మెరుగైన చికిత్స కోసం 108లో సాలూరు సీహెచ్‌సీకి తరలించారు.

రేషన్ లబ్ధిదారులకు రాగి పిండి పంపిణీ

- మార్చి నెల నుంచే అమలు
- 5.85 లక్షల మంది కార్డుదారులకు లబ్ధి



రాగి పిండి ప్యాకెట్

విజయనగరం అర్బన్: రేషన్ లబ్ధిదారులకు శుభవార్త. పేద ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యంగా ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ఆరోగ్యకర ఆహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ప్రొటీన్స్ పుష్టిగా ఉన్న ఫోర్టిఫైడ్ బియ్యం, గోధుములు పంపిణీ చేస్తోంది. తాజాగా వచ్చేనెల నుంచి రాగి పిండి పంపిణీకి సర్వం సిద్ధం చేసింది. ప్రొటీన్స్ కలిపిన రాగులను పిండిగా మార్చి ప్యాకెట్ రూపంలో కార్డుదారుకు కిలో రూ.11కు అందజేయనుంది. రాగి పిండిలో ఐరన్, పోలిక్ యాసిడ్, విటమిన్ బీ12 వంటి సూక్ష్మ పోషకాలు ఉంటాయి. ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ 2006 నిర్దేశిత ప్రమాణాల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు ప్రజా పంపిణీ వ్యవస్థ అధికారులు తెలిపారు. ముందుగా పల్లెప్రాంత ప్రజలకు, తర్వాత పట్టణ ప్రజలకు అందజేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. జిల్లాలోని 5,85,401 మంది తెలుపు రేషన్ కార్డుదారులకు రాగిపిండి అందజేస్తామని జేసీ కే.కార్తికేయ తెలిపారు. ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారులకు రేషన్ పంపిణీ సక్రమంగా సాగేలా చూడాలని వలంటీర్లను ఆదేశించారు.


మడ్డువలస పరిసరాల్లో అగ్నిప్రమాదం



మంటలను అదుపుచేస్తున్న ఫైర్ సిబ్బంది

వంగర: మండల పరిధి మడ్డువలస గ్రామ సమీపంలో వంతెనను ఆనుకుని మంగళవారం అగ్నిప్రమాదం సంభవించింది. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మడ్డువలస ప్రాజెక్టు కిందిభాగంలో గల సంగాం, మగ్గూరు గ్రామాల ఏటిబాడవ పొలాలకు మంటలు అంటుకున్నాయి. 800 మీటర్ల దూరంలో నదిఒడ్డున గల జంగిల్ కాలిబూడిదైంది. అదే విధంగా సంగాం, మగ్గూరు గ్రామాలకు చెందిన పలువురు రైతుల నీటి ఇంజిన్లు, సాగునీటి పైపులు కాలిబూడిదయ్యాయి. చెరకు పంటకు స్వల్పంగా నష్టం వాటిల్లింది. ఈ సమాచారం తెలుసుకున్న రాజాం అగ్నిమాపక శకటం సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. సకాలంలో మంటలు అదుపులోకి తీసుకురావడంతో విద్యుత్ లైన్లకు నష్టం తప్పిందని ఏఈ కె.వినయ్‌కుమార్ తెలిపారు. నష్టం వాటిల్లిన రైతులను ఆదుకోవాలని మగ్గూరు, సంగాం సర్పంచ్‌లు పోలిరెడ్డి రమేష్, గేదెల వెంకటనాయుడులు కోరారు.

పూరిల్లు, పశువుల పాక దగ్ధం



దగ్ధమైన పశువుల పాక

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద నారాయణపట్నం గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లుతో పాటు పశువుల పాక పూర్తిగా దగ్ధమై సుమారు రూ.90 వేల ఆస్తినష్టం వాటిల్లింది. ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలాలా ఉన్నాయి. గ్రామంలో నివాసం ఉంటున్న కల్లు గీత కార్మికుడు రమేష్ ఇంట్లో సోమవారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి, పక్కనున్న పశువుల శాలతో పాటు, గడ్డి వాముకు వ్యాపించాయి. మంటలు చెలరేగిన విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే బయటకి వచ్చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో రూ.30 వేల నగదు, రూ.60 వేలు విలువ చేసే నాలుగు మేకలు కాలిపోయాయి. బాధిత కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది. విజయవాడలో ఉన్న ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబుకు ప్రమాద విషయం తెలియడంతో వెంటనే గ్రామ పెద్దలతో ఫోన్‌లో మాట్లాడి బాధిత కుటుంబానికి సహాయ సహకారాలు అందించాలని సూచించారు.



అగ్ని ప్రమాదంలో మృతి చెందిన మేకలు

ఎన్నికల నియమావళి కచ్చితంగా అమలు చేయాలి

- కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. నియమావళి అమలులో ఏమాత్రం ఉపేక్షించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై ఎంసీసీ బృందాలు, ఏఈఆర్‌ఓలు, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్, వ్యయ పరిశీలకులు, పోలీసు అధికారులు ఇతర ముఖ్య సిబ్బందికి కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను సజావుగా, సమర్థవంతంగా, ప్రశాంతంగా పూర్తి చేసేందుకు ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయడం శిరోధార్యమని పేర్కొన్నారు. నిబంధనలను ఏమాత్రం ఉల్లంఘించినా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. కోడ్ అమల్లోకి వచ్చిన దగ్గరనుంచి సిబ్బంది అంతా భారత ఎన్నికల సంఘం ఆధీనంలోనే పనిచేస్తారని చెప్పారు. కమిషన్ ఇచ్చిన నిబంధనల మేరకు పనిచేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతిఒక్కరూ నిష్పాక్షికంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల విధుల నిర్వహణలో ఏమైనా సందేహాలు తలెత్తితే కాల్‌సెంటర్‌ను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రతి బృందం వీడియో గ్రాఫర్‌ను నియమించి సరైన పద్ధతిలో వీడియో రికార్డ్ చేయించాలని చెప్పారు. కచ్చితంగా శిక్షణ పడేవిధంగా, పూర్తి ఆధారాలతో కేసులను నమోదు చేయాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
ఎస్పీ ఎం.దీపిక మాట్లాడుతూ, ఎన్నికల విధుల్లో నిర్లిప్తత విడనాడాలని, అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఏ మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించినా, ఎన్నికల కమిషన్ నుంచి కఠిన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ మాట్లాడుతూ, ఎన్నికల విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ నుంచి వచ్చే నిబంధనలు, ఆదేశాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని అమలు చేయాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై ఎంసీసీ నోడల్ ఆఫీసర్ బి.అరుణశ్రీ, వ్యయానికి సంబంధించి ఎక్స్‌పెండిచర్, వివిధ అంశాలపై నోడల్ ఆఫీసర్ అరుణకుమారి పవర్ పాయింట్ ద్వారా వివరించారు. కార్యక్రమాన్ని ఎన్నికల శిక్షణ నోడల్ ఆఫీసర్ ఎం.సుధాకరరావు సమన్వయపరిచారు. కార్యక్రమంలో ఏఎస్పీ అస్మా ఫర్హీన్, ట్రైనీ ఐపీఎస్ మండా జావలి అల్ఫాన్స్, డీఆర్‌ఓ ఎస్డీ అనిత, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.